
# కోటి విద్యలు



బస్టాండ్ ప్రక్కనున్న మైదానంలో జనం గుమిగూడి ఉన్నారు.

మధ్య మధ్య ఈలలు, చప్పట్లు వినిపిస్తున్నాయి. చుట్టూరా గుమిగూడినవారు ముందువాళ్ళ భుజాల మీదనుంచి మెడలుసాచి ఉత్సాహంగా చూస్తున్నారు.

'అది ఏదో గారడీ అయి ఉంటుందిలే'... అని అనుకుంటూ, అయినా ఏమిటో చూద్దామని ముందుకు వెళ్లాను.

అనుకున్నట్లే అది గారడీ ప్రదర్శనే!

అప్పటివరకు చిల్లరమల్లర విద్యలు చేసి చూపాడేమో... నేను వెళ్లిన సమయానికి నేల మీద పడుకోబెట్టిన ఒక వ్యక్తిని గాలిలోకి లేపే ప్రయత్నంలో ఉన్నాడు ఆ గారడీవాడు.

నేల మీద ఒక వ్యక్తి అచేతనంగా పడుకొని ఉన్నాడు.

అతనిపై ఒక దుప్పటిని పూర్తిగా కప్పి నాలుగు వైపులా ఏవో చిన్న చిన్న బరువులు పెట్టాడు.

"అయ్యలారా, బాబులారా.., అమ్మలారా, అక్కలారా.., చిట్టిపొట్టి పిల్లలారా... ఏదీ- మీరందరూ ఒక్కసారి గట్టిగా చప్పట్లు కొట్టండి. ఇప్పుడు ఇక్కడ పడివున్న మనిషిని గాలిలోకి లేపుతాను" అన్నాడు గారడీవాడు- సినిమా ఫక్కీలో.

అందరూ చప్పట్లు కొట్టారు. పిల్లలు మరీ జోరుగా కొట్టారు.

"అయ్యలారా... మరో విషయం- ఈ మనిషి పైకి లేచే సమయంలో దయవుంచి ఎవరూ వెళ్లిపోకండి. అలా చేస్తే ఈ నా బిడ్డడు కిందపడి చచ్చిపోతాడు" అన్నాడు గద్గద కంఠంతో.

జనం జరగబోయే వింతని చూడడానికి ఒళ్లంతా కళ్లు చేసుకొని ఆసక్తిగా చూడసాగారు.

గారడీవాడు ఏక్‌తారను తీసుకుని ఏదో సినిమా పాట వాయిస్తూ జనంవున్న లోపలి అంచున ఒక చుట్టు తిరిగాడు. మళ్లీ- "బాబులు ఇంకొకసారి గట్టిగా చప్పట్లు కొట్టండి" అన్నాడు.

చప్పట్లు మళ్లీ గట్టిగా మ్రోగాయి.

"అయ్యలారా... మనిషిని పైకి లేపుతున్నాను- ఎవ్వరూ కదలకండి!" అని గట్టిగా అంటూ చేతిలోని ఎముక దండంతో "ఉర్... ఉర్..!" అని ఇంకేదో అంటూ ఆ ఎముకని పైకి ఎత్తాడు.

అందరూ చూస్తుండగానే నేల మీద పడుకొనివున్న వ్యక్తి గాలిలో సుమారు ఆరు అడుగుల ఎత్తుకి ఉన్న స్థితిలోనికి లేచాడు. అతనిపై కప్పిన దుప్పటి అన్నివైపులనుంచి నేల మీదకి జారాడసాగింది.

జనం పెల్లుబుకిన ఉత్సాహంతో జోరుగా చప్పట్లు కొట్టారు. ఈలలు వేశారు.

గాలిలో ఆ మనిషిని కొంచెంసేపు అలాగే వుంచి, "అబ్... నీచే ఆవ్!" అని ఇంకేదేదో అంటూ చేతిలోని ఎముకని కిందకు చూపించాడు గారడీవాడు.

గాలిలోని ఆ వ్యక్తి నెమ్మదిగా నేల మీదకి వచ్చాడు.

జనం మళ్లీ జోరుగా చప్పట్లూ, ఈలలూ వినిపించారు.

నేల మీదకి దిగిన వ్యక్తి చైతన్యంలోకి వచ్చి దుప్పటి తొలగించుకొని బయటకు వచ్చాడు.

నేను చాలా గారడీలు చూశాను కాని, మనిషిని గాలిలో నిలబెట్టడం ఎప్పుడూ చూడలేదు. అందులోనూ రోడ్డు ప్రక్కన తన విద్యలను ప్రదర్శించే ఒక మామూలు గారడీవాడు ఇంతటి అద్భుతమైన మాజిక్‌ను చూపడంతో నేను ఆశ్చర్యపోయాను. దాంతో కుతూహలం పెరిగి ఆ గారడీ పూర్తిగా చూడడానికి అక్కడే ఉండిపోయాను.

గారడీవాడు తాను కాలుస్తున్న సిగరెట్‌ని నోట్లోంచి తీసి నిప్పు ఆర్పాడు. ఆ సిగరెట్ పీకను నేలమీద పెట్టిన ఒక పుర్రె నోట్లో పెట్టాడు. ఒక డాల్డా డబ్బా తీసుకొని జనం దగ్గరకు వస్తూ-

"అయ్యా- బాబూ... చూశారుగా నా విద్య! ఇదే ఒక పెద్ద హాల్లో పేరున్న మెజీషియన్ చేస్తే పది రూపాయలు, పాతిక రూపాయలు టికెట్లు కొనుక్కొని వెళ్లి చూస్తారు. పేదవాడ్ని, పిల్లలుగలవాడ్ని... రూపాయి, రెండు, మూడు, మీకు తోచిన ధర్మం చేయండయ్యా..!" అంటూ తిరగసాగాడు.

వాడు చెప్పింది ఎంతైనా సబబనిపించింది. నా జేబులో పది రూపాయలు, రెండు రూపాయల నోట్లు ఉన్నాయి. పది రూపాయలు వేసే ధైర్యం, శక్తిలేక నా దగ్గరకి రాగానే రెండు రూపాయల నోటును వేశాను. తోచిన మేరకు కొంచెం బాగానే ఆ డబ్బాలో వేయసాగారందరూ.

ఇంతలో... జనంలోంచి ఓ వ్యక్తి అందుకున్నాడు-

"నువ్వు చేసింది గొప్పేమీ కాదు. ఇది చాలామంది చేస్తారు. నేను చెప్పింది నువ్వు చేస్తావా?" అన్నాడు ఛాలెంజ్ చేస్తూ.

తిరుగుతున్నవాడల్లా ఆగిపోయాడు ఆ గారడీవాడు.

ఛాలెంజ్ చేసిన వ్యక్తికి సమీపంగా వెళ్లి, "చెప్పు... ఏంచేయాలో!?" అన్నాడు.

ఆ వ్యక్తి- "అదుగో... ఆ పుర్రె సిగరెట్ కాల్చేటట్లు చేస్తావా?" అన్నాడు.

గారడీవాడు ఆ వ్యక్తి వంక ఎగాదిగా చూశాడు.

"నేను చేస్తానో, లేదో వేరే సంగతి! నువ్వు చేయగలవా?" అన్నాడు.

"నా సంగతి నీకనవసరం! నువ్వు చేయగలిగితే చెప్పు. లేకుంటే చెయ్యలేనని చెప్పు."

"అలాగే చేస్తాను... పందెం కాస్తావా?"

"ఆ.... ఇదుగో- యాభై రూపాయల పందెం!" అంటూ నోటు తీసి ప్రక్కనున్న పెద్దమనిషి చేతిలో పెట్టాడు.

"నేను చెయ్యలేకపోతే ఏంతియ్యాలి?" అన్నాడు గారడీవాడు.

"ఏమీ అక్కరలేదు. చెయ్యలేనని నీ ఓటమిని ఒప్పుకొని ఈ ఊరిలో మళ్లీ కనిపించకుండా వెళ్లిపో!" అన్నాడు ఆ వ్యక్తి దర్పంగా.

"నీ దయ నాకక్కరలేదు. నేనూ పందెం కాస్తున్నాను. నేను ఓడిపోతే నేనీ వంద రూపాయలిస్తాను. నువ్వన్నట్లు ఈ ఊళ్లో మళ్లీ నా ఆట చూపను" అంటూ వంద రూపాయలు తీసి ప్రక్కనున్న మరో పెద్దమనిషి చేతిలో పెట్టాడు.

ఈ వాగ్వివాదం మంచి రంజుగా సాగుతూండడంతో అసలు గారడీకన్నా వారి ఛాలెంజీలను ఆసక్తిగా గమనించసాగారు ప్రేక్షకులు.

"మరో విషయం... నీ మాటలు వింటుంటే నువ్వూ గారడీవాడివని నాకు అనిపిస్తోంది. నామీద ఇంత పెద్ద ఛాలెంజీ చేశావు కాబట్టి, నేను గెలిస్తే ఈ జనం ముందు నా కాళ్లు పట్టుకొని తప్పయిందని ఒప్పుకో. అంతేకాదు- ఆ పుర్రె చేత నువ్వు సిగరెట్ కాల్పించు. నీకు ఇంకో వంద రూపాయలు ఇస్తాను" అంటూ ఛాలెంజ్ మీద ఛాలెంజ్ విసిరాడు గారడీవాడు.

"సరే... నేను సిద్ధమే!" అన్నాడు ఆ వ్యక్తి.

కథ మంచి రసపట్టులో పడింది.

జనంలో సూది క్రిందపడ్డా వినిపించేటంతటి నిశ్శబ్దం అలముకొంది.

గారడీవాడు "అయ్యలారా... అక్కడవున్న పుర్రె మీ కళ్లెదుటే సిగరెట్ కాలుస్తుంది... చూడండి!" అంటూ మంత్రదండం తీసుకున్నాడు.

"ఆగు!" అని గట్టిగా అరిచాడు ఆ వ్యక్తి.

"పుర్రె నోట్లో ఇందాక నువ్వు వెలిగించిన సిగరెట్‌ని ఉంచావు. దానికి నిప్పు ఉందో, ఏమో... అది వద్దు. వేరే సిగరెట్ పెట్టు!" అన్నాడు ఆ వ్యక్తి.

"అలాగే!" అంటూ జేబులోంచి వేరే సిగరెట్ తీసి మళ్లీ ఆగిపోయాడు గారడీవాడు.

"నా జేబులో సిగరెట్ అయితే నేనేదో చేశానంటావు. నీ దగ్గర సిగరెట్ ఉంటే నువ్వే పెట్టు. లేదా ఎవరి దగ్గరైనా తీసుకొని పెట్టు" అన్నాడు మళ్లీ.

తన జేబులోంచి కొత్త సిగరెట్ తీసి ఆ పుర్రె నోట్లో పెట్టి, పాతదాన్ని అవతల విసిరేశాడు ఆ వ్యక్తి.

జనం ఉత్సాహంతో చప్పట్లు కొట్టారు.

ఆ పుర్రె నుంచి ఆరడుగుల దూరంలో నిలబడ్డాడు గారడీవాడు. తల పైకెత్తి మంత్రదండం నుదుటికి ఆనించుకొని ఏదో మంత్రాలు లోలోపలే చదువుకున్నాడు.

ఆ తర్వాత తన జేబులోంచి ఒక కొత్త సిగరెట్ తీశాడు.

"బాబులారా... బాగా చూడండి. ఇది కొత్త సిగరెట్! ఇక్కడ నేను సిగరెట్ అంటిస్తాను. అక్కడ పుర్రెలో సిగరెట్ అంటుకొంటుంది. ఇక్కడ నేను పొగ పీల్చి వదులుతాను. అక్కడ పుర్రె నోట్లో నుంచి పొగ వస్తుంది... చూడండి!" అంటూ జేబులోంచి అగ్గిపెట్టె తీసి సిగరెట్ వెలిగించాడు.

విచిత్రం..! ఇక్కడ ఏ విధంగా సిగరెట్ అంటుకొని ఎర్రపడిందో, అదేవిధంగా పుర్రె నోట్లోని సిగరెట్ కూడా అంటుకొని ఎర్రబడింది.

గారడీవాడు గట్టిగా పొగని లోపలికి లాగి గుప్పుమని బయటకి వదిలాడు. పుర్రె నోటినుంచి కూడా అదేవిధంగా గుప్పుమంటూ పొగ బయటకి వచ్చింది.

ప్రేక్షకుల ఆనందానికి పట్టపగ్గాలు లేవు. చప్పట్లతో నేల దద్దరిల్లిపోయింది. ఈలలతో ఆ ప్రాంతం హోరెత్తిపోయింది.

ప్రేక్షకులు అందించిన ఉత్సాహం కొత్త ఊపు కాగా.., ఆ గారడీవాడు సిగరెట్ పొగ రైలింజన్‌లోంచి వచ్చినట్లు గుప్పుగుప్పుమంటూ వేగంగా వదలసాగాడు. అతనిక్కడ ఏ విధంగా, ఎంత వేగంగా వదిలితే- అదే విధంగా, అంతే వేగంగానూ పుర్రె నోట్లోంచి పొగ రాసాగింది. పీల్చి పీల్చి చివరకి నోట్లోంచి సిగరెట్ పీకను తీసి క్రింద పడేశాడు ఆ గారడీవాడు. చిత్రంగా- పుర్రె నోట్లోంచి కూడా సిగరెట్ పీక క్రింద పడిపోయింది.

జనం మరోసారి చప్పట్లు కొట్టారు, ఈలలు వేశారు.

"ఒరేయ్- వాడు పారిపోయిండేమో... చూడండిరా!" అన్న కేకలు జనంలోంచి వినిపించాయి.

ఆ వ్యక్తి ఎక్కడికీ పోలేదు- అక్కడే ఉన్నాడు. అవమానంతో తల దించుకున్నాడు.

"ఇప్పుడేమంటావు?!" అన్నాడు గారడీవాడు విజయగర్వంతో.

ఏమీ మాట్లాడలేదు ఆ వ్యక్తి.

"కాళ్లు పట్టుకో బే!" అంటూ జనంలోంచి కేకలు వినిపించాయి.

"చూడు బాబూ... నువ్వు కూడా గారడీ చేయగలవని అనుకుంటున్నాను. సాటివాడి చేత నలుగురి ముందూ నా కాళ్లు పట్టించుకొని అవమానించను. అయితే నీ విద్య కూడా ప్రదర్శించు. నువ్వు కూడా ఆ పుర్రె చేత సిగరెట్ కాల్పించగలిగితే నువ్వు నా అంతటివాడివని ఒప్పుకుంటాను" అన్నాడు గారడీవాడు.

గారడీవాని ఔదార్యానికి ముగ్ధులయ్యారు ప్రేక్షకులు.

'సరే...' నంటూ ముందుకు వచ్చాడు ఆ వ్యక్తి.

“అవ్ భాయ్... చెయ్యి కలుపు!” అంటూ చేయి ముందుకు సాచాడు గారడీవాడు. అతని ఆప్యాయతకీ, ఔదార్యానికీ విస్తుపోతూ అతనితో చేయి కలిపాడు ఆ వ్యక్తి.

“సరే... ఇంక నీ విద్యని ప్రదర్శించు” అన్నాడు గారడీవాడు.

‘సరే’నంటూ చేయి వెనక్కి తీసుకోబోయాడు ఆ వ్యక్తి.

ఆశ్చర్యం..!

అతని చేయి గారడీవాడి చేతికి అంటుకుపోయింది. ఎంత ప్రయత్నించినా రాలేదు. జనం ఈ వింతని విచిత్రంగా చూస్తూండిపోయారు.

చేయి లాక్కొని లాక్కొనీ అలసిపోయాడు ఆ వ్యక్తి. చివరికి కళ్లంబడి నీళ్లు కూడా వచ్చాయి.

“ఒప్పుకో... నీ చేయి ఊడదీసుకోలేనని!” అన్నాడు గారడీవాడు గంభీరంగా.

“ఒప్పుకుంటున్నాను... నాది తప్పయిపోయింది. క్షమించు!” అన్నాడు ఆ వ్యక్తి. ఆ మాటలు అన్నదే తడవుగా అతని చెయ్యి ఊడింది.

గారడీవాని కాళ్ల మీద పడబొయ్యాడు ఆ వ్యక్తి.

అతన్ని వారించి “పోన్లే... కాని, ఇప్పుడు ఆ పుర్రె మీద నీ విద్య ప్రయోగించి చూపుతావా?” అని అడిగాడు.

“లేదన్నా... నేనేదో చిన్న విద్యలు చేసే గారడీవాడిని. నీ అంతటి విద్య నాకు లేదు” అన్నాడు ఆ వ్యక్తి తలదించుకొని.

“అలా అన్నావు- బాగుంది. ఇదుగో... సాటివాడిగా ఇస్తున్నాను. ఈ ఇరవై ఉంచుకో!” అంటూ డబ్బు అతని చేతిలో పెట్టాడు గారడీవాడు.

అంతకంతకీ పెరిగిపోతున్న గారడీవాని ఔదార్యానికి మరీ మరీ ముగ్ధులు కాసాగారు ప్రేక్షకులు.

“అయ్యలారా... ఇతనూ ఓ బీద గారడీవాడే కదా- తమకి తోచిన ధర్మం చేయండి!” అని ప్రేక్షకులకు విజ్ఞప్తి చేశాడు గారడీవాడు.

అతని ఔదార్యానికీ, విద్యకు ముగ్ధులైన ప్రేక్షకులు ఏదోలాగా ఎవరికి తోచింది వారు వానికి ఇచ్చారు. ఆ విధంగా సుమారు అరవై, డెబ్భై రూపాయలు వచ్చింది.

అటుతర్వాత రెండుమూడు చిల్లర విద్యలు చూపించి ఆట ముగించాడు గారడీవాడు.

అందరూ ఎవరిదారిన వారు పోయారు. ఆ విచిత్ర వ్యక్తిని నెమరువేసుకుంటూ నేను ఇంటిదారి పట్టాను.


ఆ తర్వాత మరో గంటకి నేను ఏదో పనిమీద రైలుస్టేషన్‌కి వెళ్లి, కాఫీ తాగుదామని క్యాంటీన్‌కి వెళ్లాను. అక్కడ ఓ మూలగా ఉన్న బెంచీ మీద ఆ గారడీవాడు, అతన్ని ఛాలెంజ్ చేసిన వ్యక్తీ కనిపించారు.

'వాళ్ళక్కడ ఏమి చేస్తున్నారా...' అని ఆశ్చర్యంతో చూసేసరికి, వాళ్ళు ఆనాటి సంపాదనను పంచుకుంటున్నారు.

అప్పుడు నాకర్థం అయ్యింది- వాళ్ళు ఆడిందంతా నాటకమేనని! మామూలుగా గారడీ చేసినందుకు వచ్చే డబ్బుతోపాటు ప్రజల సానుభూతిని పొంది మరింత సంపాదించడానికి చక్కగా వేసిన పథకమని!!

'పథకం' మాట అటుంచి ఆ గారడీవాని విద్యకి జోహార్లు అర్పించాను మనస్సులోనే.

*- కథాకళి... 2వ సంచిక '86*



## విశాల హృదయం

మిస్ లిల్లీని 'మిస్' అయిన వారెందరో ఉన్నారు. ఆమె 'మిస్' చేసుకున్న వారి సంఖ్య తక్కువేం కాదు. చేతి రుమాళ్లు మార్చినంత సులువుగా ఆమె ప్రియుళ్లను మారుస్తుండేది. ప్రేమించడం, ఆ తర్వాత వదిలేయడం ఆమెకి అతిసామాన్య విషయాలు.



ఒకసారి ఆమె స్నేహితురాలు లలిత అడిగింది-

"లిల్లీ... ఏమిటిది? ఇంతమందితో ప్రేమ నడుపుతూండడం, వదిలేస్తుండడం... ఇదేమైనా బాగుందా?" అని.

"చూడు లలితా... నాది విశాల హృదయం. ఎంతమంది నన్నొదిలేసినా పర్వాలేదు. ఆ వదిలేసే వాళ్లు నాకు 'తగినంత' వదిలేస్తే చాలు!" అంది లిల్లీ అతి సులువుగా.